
# అంగడి వినోదం

- డా॥ వాసా ప్రభావతి



ఆరోజు ఉగాది ఊరంతా సందడే. హైదరాబాదు నగరంలో అది మహారద్దీగా ఉండే ఓ రాజవీధి. ఆ ఉగాది రోజు ఆ వీధిలో ఓ బట్టల షాపు ప్రారంభోత్సవం. ముహూర్తం దగ్గరపడింది మొదలు షాపు యజమానికి ఒకటే హడావిడి పడిపోతున్నాడు. పనివారికి అవసరం లేకపోయినా ఏదో ఒకటి పురమాయిస్తూనే ఉన్నాడు. వాళ్ళు కూడా యజమానితో పాటు మరింత హడావిడిగా అటు ఇటు తిరుగుతూ వారి బాధ్యత తెలియజేసు కుంటున్నారు.

'ఏందిరా! ఆ పారెట్ వేషగాడు వచ్చిండా! లేదా?'

యజమాని గద్దింపుకు భయపడ్డ మధ్యవర్తి అక్కడకు పరుగెత్తుకు వచ్చాడు.

"ఎప్పుడో వచ్చిండయ్యా! ఆడ నిలబడిండు" అన్నాడు చేత్తో అటు చూపిస్తూ!

అటు చూసిన యజమాని నిజంగానే ఆశ్చర్యపడ్డాడు.

"అబ్బో! నిజం పారెట్టులానే ఉందే? ఇంక ఈ షాపులో కనక వర్షం కురవవలసిందే?" మురిసిపోయాడు యజమాని.

పారెట్టు వేషం ధరించిన బుచ్చి తన వేషం చూసుకుని మురిసిపోతున్నాడు. పైగా ఆ షాపు ప్రారంభోత్సవమంతా తన మీదే ఉందని గర్వపడిపోతున్నాడు కూడా!

ఓ వారగా నిలబడిన మైసమ్మ కొడుకు వేషం చూసి తన కొడుక్కి గొప్ప అదృష్టం పట్టిందనుకుంది.

"ఎర్రని ముక్కుతో, పచ్చన రెక్కలతో సిలకమ్మ లెక్కనే కొడుతున్నావు బిడ్డా!" కొడుకు దగ్గరగా వెళ్ళి మెటికలు విరిచి మరీ వచ్చింది. చేతిలో యజమాని ఇచ్చిన ఎడ్వాన్సు 300 రూ. మైసమ్మకు వెయ్యి రూపాయల్లా అనిపించి మరోసారి లెక్క పెట్టుకుని చూసుకుంది. మొలనున్న గుడ్డ సంచీ తీసి అందులో ఆ డబ్బు పెట్టుకుంది. తిరిగి సంచీ మొల్లో పెట్టుకుంటూ మరోసారి చూసుకుంది.

"ఎన్నాళ్ళు పోగుసేత్తే ఇంత రొక్కం మిగులుతాది? బుచ్చిగాడికి ఇసువంటి ఏసాలె దొరకాలా?" అనుకుంది తమ అదృష్టానికి మురిసిపోతూ.

"బిడ్డా! ఆడ డబ్బా యెట్టినా! కూడు తినడం మరవబోక" అంటూ బుచ్చికి పదేపదే చెప్పింది. పొద్దుటే చిద్దిగూడు తినిపించి అంబరుపేట నుంచి నడిపించుకూంటూ తీసుకొచ్చింది. బుచ్చి ఆకలికి తట్టుకోలేడు. అందుకే మైసమ్మ కొడుక్కి అన్నిసార్లు చెప్పింది.

"నే పోతున్నా బిడ్డా! కూడు తినడం మరవబోక! అదిగో! డబ్బా ఆడనే పెట్టినా బిడ్డా! కూడు తినడం మరవబోక!" అంటు మైసమ్మ డబ్బావైపు చెయ్యి చూపిస్తూ చెప్పిందే మళ్ళీమళ్ళీ చెప్పింది. వెనక్కి తిరిగి కొడుకు వైపే చూస్తూ మైసమ్మ తన పని మీద వెళ్ళిపోయింది.

"రండీ! రండీ!" అంటు బుచ్చి మాటలు నేర్చిన రాచిలుక లాగే ముద్దుముద్దుగా పలుకుతూ రెండు చేతులతో అందరినీ ఆహ్వానిస్తున్నాడు. అతని పిలుపుకు

పైగా "జల్దీ ఆస్పటల్‌కి తీసుకెళ్ళవమ్మా!" అంటూ తొందరపెట్టాడు. అక్కడ నుంచి ఆ బుచ్చిగాడిని ఎంత తొందరగా తీసుకువెడితే అంత మంచిదని అతని ఉద్దేశం. వాడు ఇటోఅటో అయితే మరీ ప్రమాదమని అతని అసలు భయం. బుచ్చి బతుకు తాడోపేడోనని తోటి పనివారంతా నిజంగానే భయపడ్డారు. బుచ్చిని సాయంపట్టి బయటకు తీసుకువచ్చారు. ఆ కొత్త వ్యక్తే ఓ ఆటో మాట్లాడి అక్కడికి దగ్గరలో ఉన్న ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపొమ్మన్నాడు. అందరితోపాటు అతను కూడా ఓ చెయ్యి వేసి బుచ్చిని ఆటోలో పడుకోపెట్టారు. మైసమ్మ బుచ్చి తల తన వళ్ళో పెట్టుకుని ఆటోలో కూర్చుంది. యాది కూడా ఆటో ఎక్కి బుచ్చి కాళ్ళవైపు కింద కూర్చున్నాడు.

"పొద్దటి 300 రూపాయలున్నాయి. ఇప్పుడీ మరో మూడొందలు! ఈడిని కాపాడుకోడానికి చాలుతాయి!" కారే కన్నీళ్ళు తుడుచుకుంటూ మైసమ్మ ఆలోచించుకుంది.

"మీవల్లే నా బిడ్డని కాపాడుకోగలిగా! నా బిడ్డని రచ్చించావు బాబూ?" అంటు మైసమ్మ ఇంకా అక్కడే నిలబడ్డ ఆ వ్యక్తులకి చేతులు చోడించి దండాలు పెట్టింది.

"ఏదీ ఎన్నొందలిచ్చిండు? సూపీ?" అని ఆ వ్యక్తి అనగానే మైసమ్మ డబ్బు దాచిన గుప్పిడి విప్పి చూపించింది. కోడిపిల్లను తన్నుకుపోయే డేగలా అతను తన చేతిలో డబ్బు తన్నుకుపోతాడని ఆవెకు తెలియలేదు.

"యజమాని చేత కక్కించిన డబ్బంతా నీకోసం కాదు?" అంటు అతను ఆమె చేతిలోని రెండు వందల నోట్లు ఠక్కున అందుకున్నాడు. వచ్చిన పని పూర్తయిందని కాబోలు మరో వ్యక్తితో కలిసి పక్కకు జారుకున్నాడు. మైసమ్మ గుండె కాసేపు చలనం లేకుండా పోయింది. ఆటో ఒక్కసారి కదలగానే గుండె కదిలి తిరిగి ఆమె ఈ లోకంలోకి వచ్చింది. అది కలో నిజమో తెలీక ఆమె చేతిలోని నోటువైపు చూసుకుంది. ఒక వంద నోటే జాలిగా చూస్తూ కనబడింది.

అది కలకాదు! నిజమే? అని నిర్ధారించుకుంది. "ఈ లోకం పాడైపోనాది అంటారు! ఇదే కాబోలు! ఏదైనా నా బిడ్డను కాపాడుకోవాల! ఆడు బతకాల?" అనుకున్న మైసమ్మ జర త్వరగా పోనీ! బాబూ!" అంటూ ఆటో డ్రైవర్ని తొందరచేసింది. ఆటో మరింత వేగం పుంజుకుంది. అవేమి తెలియని యాది బుచ్చివైపు జాలిగా చూసాడు.

14 సంవత్సరాల కొడుకు పదేళ్ళ పిల్లగాడిలా వళ్ళో ముడుచుకుపోయి పడుకున్నాడు. కొడుకు వైపు చూడగానే ఆమెకు దుఃఖం సుడులు తిరిగింది.

"ఇంకెప్పుడు డబ్బు కోసం పిల్లగాడిని అమ్ముకోకూడదు! ఈడు ఇంత డబ్బు తన్నుకుపోయింది. ఆ మధ్యవర్తి గాడికి ఎంత దక్కిందో" అనుకున్న మైసమ్మకి మరంత బాధ కలిగింది. కొడుకు ఒళ్ళంతా ఆప్యాయంగా నిమురుతుంటే ఆమె కన్నీళ్ళతో బుచ్చి శరీరం తడిసిపోయింది.

అంగడి వినోదం తన బతుకులో అంత విషాదం నింపుతుందని ఆమె అనుకోలేదు. చేతిలో డబ్బు చాలకపోయినా అప్పు చేసైనా కొడుకును బతికించుకోవాలనుకుంది.

ఆటో హాస్పటల్ ముందు ఆగగానే మైసమ్మ ఊపిరి పీల్చుకుంది. కొడుకు ఊపిరి కదులుతోందని తెలుసుకుంది. లేనిబలం తెచ్చుకుని బుచ్చిని భుజాన వేసుకుని హాస్పటల్లోకి పరుగెత్తింది.

(ఆకాశవాణి సౌజన్యంతో)

# వాట్ ఎ ఫన్ - వాట్ ఎ జోక్

– పెండ్యాల సుబ్బారావు.

పండుగలన్నీ దండగలనుకుంటూ
డబ్బులు దండుకోవడంలో బిజీ బిజీ అవుతాం
దేశభాషలందే కాదు– తెలుగు దేశమందే
తెలుగు 'లెస్' అయిపోతోంది.
కలవక కలిసినా ఇద్దరు తెలుగువాళ్లు
ముద్దుముద్దుగా ఇంగ్లీషులో పలకరింపుల ఫ్యాషన్
ఫ్యాక్టరీలో పూసిన వాసన లేని వాడని పూలు
గుత్తులు గుత్తులుగా అలంకరించుకుని ఆనందిస్తాం.
దేముళ్లను జోకర్లుగా గీ(చే)స్తే
కామెడీగా నవ్వుకుని మురిసిపోతాం.
ఇంటింటా వెల్లివిరియవలసిన పండుగ శోభ
బుల్లితెరకు పరిమితమవుతుంది.
'టీనేజీ' 'కాలేజీ' ప్రభంజనంలో
పరిణితి చెందిన వయస్సు అనుభవం
పనికిమాలినది అవుతుంది.
అమ్మాయిల అందానికి అర్థం మారిపోయి
ప్రచార పోటీలో ముందు నిలవడం కోసం
గుడ్డలు కుదించుకుని వళ్లు విరుచుకుని
ముందుకురుకుతారు.
జీవితం వెలగవలసిన దీపాలు
తొందరపడి చిచ్చుబుడ్లయి ఒక్క వెలుగు వెలిగి
చచ్చుబడి చిచ్చు రేపుతాయి.
ప్రపంచమంత అర్థం వున్న 'ప్రేమ'
అమ్మాయికీ అబ్బాయికీ పరిమితమై
మనీ పర్సులో ఇమిడిపోతుంది.
విదేశీ ఛానెళ్లలో ఇంగ్లీషు కోయిలలు
కూసే కూతలకు కుర్రాళ్లు
కోరికల ఆర్కెస్ట్రాలో ఊగుతూ
కుప్పలు తెప్పలై కురుస్తున్న
ప్రేమకథా చిత్రాల మత్తులో తూగుతూ...
ఉనికిని కోల్పోతారు.
మెదళ్లకు పదునుపెట్టి హృదయ ద్వారాలు తెరచి
కఠిన వాస్తవాలను, భావి స్వప్నాలను
దర్శింప చేయగల అక్షరాలు
పలుకరించే దిక్కులేక పుస్తకాలలో
నిద్రపోతాయి.
ఇంగ్లీషు వేషం వేసిన తెలుగువాడు
ఇంగ్లీషు యాసను బోలిన తెలుగు భాష
తెలుగు ఉగాది శుభోదయాన కూడా
'విష్‌యూ హ్యాపీ తెలుగు ఉగాడి' అంటూ
కరచాలనం చేసుకుంటూ ముందుకు పోతున్నా.
వాట్ ఎ ఫన్ – వాట్ ఎ జోక్!